# పగా? పొగా?

నేనీ వ్రాస్తూవున్న ఇతివృత్తం
యుద్ధానంతరం 'డిమోబలైజేషన్'
మెమోరాండాలోంది. యుద్ధం అయిపోయిందికదా రైళ్ళు ఖాళీగా వుంటాయని "సివిలియన్సు" చింతలుడిగి ప్రయాణం చేయ వచ్చు ననుకొనే స్థిమితపు ఘడియలుమాట.

క్రిందా మీదా క్రిక్కిరిసిపోయివున్న బండ్లలోనైనా ఎల్లాగో వోలాగ లోనికి దూరి, మంచి మాటాడి చోటు సంపా దించుక్కూర్చోవడం, కృష్ణమోహనుడు, ఆదాకా అందరిలోనూ చాలా గొప్పగా చెబుతూ వుండేవాడు——గూడకట్టేసుకున్నప్పుడు మనవాడి కెవడో అయ్యర్ చోటిచ్చేవాడు. నిక్కర్ తొడిగి నప్పుడు ఏ మేజరో ఏకలనల్లో రెండోతరగతి గాడీలోకే పిలుచుకు పోయేవాడు. వొట్టి జుబ్బా టర్కిటవల్‌తోను పోరంబోకు వేషంలో వున్నప్పుడు స్వీట్సు వెండారుకు ఎంత అభ్యంతరం వుండేదికాదో మనవాడికంత అభ్యంతరం వుండేదికాదు. ఆడ వాళ్ళ బండిలోకి ఎక్కి పోయేందుకు. దానికితోడు అరవానికి అరవం మాట్లాడగలడు. ఉర్దూకు ఉర్దూ ఏకెయ్యగలడు. శ్రీరంగం అయ్యంగార్ని మ్లేచ్ఛోచ్చారణతోను కాబూల్‌వాలాను తమిళం పృచ్ఛింపుతోను హడలగొట్టగలడు. పడతిట్ట గలడు. నోరున్న ముండాకొడుకు కృష్ణమోహనుడు. నోరుండడమే కాదు. రైలుబండి ఎక్కడంలోను, ఎక్కి కూర్చోవడంలోను, కూర్చున్న కాడినించి కునికిపాట్లు పడకుండా ఉన్న నలుగుర్నీ తనచుట్టాల్లా భావించుకు పరామర్శించడంలోను అభినందించడంలోను ఆయువు పట్టులు తెలిసిన అపురూపపు మొనగాడు.

కృష్ణమోహనుని "సిమన్నారి" వేషాలు విపరీతపు చర్యలు అమేషా కనిపెడుతూ, వాడివెనకాలో ముందో కూడా కూడా ప్రయాణం చేసే సమానఫాయాపనిలేని రెండోవ్యక్తి రామమోహనుడు. తాడేపల్లిగూడెంలో నాటిరాత్రి "అప్టు" తన్నుకుచచ్చినా చోటివ్వనిమచ్చుగావుంది. రామమోహను డెల్లా గన్నా ఇంటర్‌లో ఇరకాలి.—ఒకచోట ఒక కానులోంచి ఒక మనిషి, పీపాలోకి తల మొలదూర్చి ఇవలకు వచ్చే సర్కస్ పనిమంతుడిలా ప్లాట్‌ఫారమ్‌మీదకు బండిలోంచి వెలువడుతూ వున్నాడు. ఆ బయలుపడుతూవున్న మనిషియొక్క శిరసోదయం తలుపుసందులో అయిందో లేదో ఇంకా—"ఒరేవ్! కృష్ణ మోహన్! నీవట్రా? ఏమిటి విశేషకాయలు? రా! త్వరగా దిగు! గార్డు పచ్చలైట్ చూపేడు!" అంటూ రామమోహను డెదురుకొన్నాడు. కృష్ణమోహన్ "ఆడదానిపగ అయితే ఎల్లా గైనా భరించవచ్చును గాని పొగ భరించలేంరా!" అంటూ ప్లాట్‌ఫారమ్‌మీద కురికాడు. రామమోహన్‌కు మరి మాట్లాడ్డాని కవకాశంలేకపోయింది. లోపల పగ, పొగ భేదం స్వయంగా తాను కనుగొందామనే వేకువ అప్పుడే రామమోహనులో రేకెత్తి పోయింది. లోపల వాండ్లు తలుపు బిడాయించబోతూవుంటే "ఇప్పుడు దిగినవాణ్ణే! నేను మోహనుణ్ణి!" అంటూ తలుపట్టుకు ఎగబ్రాకి సామేను లోపలకు పారేశాడు. తక్కిన సగాన్ని, చేత నైతే బ్రేక్‌వాన్‌లో వేసేసుకోవోయి గార్డూ!" అన్నట్టు వెలుపలకు వ్రేలాడేసి వుంచేశాడు. ఒకవిధంగా ఆలోచిస్తే తలుపు కిటికీని అని. హారిజాంటల్ బోర్లా ఫీటు చేస్తూవున్నాడు. గడెక్కిన సానిలా. గార్డు ఈలేస్తూ రామమోహనుని కాళ్లుచ్చుకు

లోపలకు నెట్టాడు. అప్పుడైనా లోపల వాళ్ళు రామమోహానుని తలట్టుకోవచ్చునా? పట్టుకోలేదు. ఒక్కడూ కదలలేదు. ఒక్కడూ మెదలలేదు.

ఆ కంపార్టుమెంటు మూడుబల్లల మెత్తలమీద మూడు నాలుగులు పంద్రెండు అని ఎక్కం లెక్కించుకుంటూ, ఇది పంద్రెండుగురుకు మాత్రమే అంటూ—అళ్వారుల స్వరూపాలై కూర్చున్నారు కొందరు. మిగతావాళ్ళందరూ ముక్కులకు ముక్కులు రాచుకుంటూ "ఇదెక్కడి సంత" అని అనుకుంటూ క్రిక్కిరిసి నిలబడ్డవాండ్లే—వాళ్ళేం సాయపడతారు కొత్త ఎంట్రీకి. గార్డుతోసిన తోతకు రామమోహానులో కొత్తచైతన్యం కొంత కలిగి స్థిరంగా ఉత్తిష్ఠుడయ్యాడు. పన్నిద్దరాళ్వారుల్ని కంటూ ప్రతిష్ఠాపితుడయ్యాడు నిలువుజీతంమీద ఎల్లాగో వోలాగు!

ఆ ఆళ్వారుల్లో ఒక విగ్రహం స్త్రీ విగ్రహం—ఈమెను గురించే కాబోలు కృష్ణమోహన్—"పగ పొగమాట ఉపయోగించింది" అని తలపోశాడు రామమోహన్.

ఆ స్త్రీ సిగరెట్‌మీద సిగరెట్ ముట్టించి ముక్కుసోణాలంటా, పెదవుల కోణాలంటా పొగ వదిలేస్తూవుంది. బాసెం పట్టుగా కూర్చునివుంది. వొళ్లో లిటరేచర్ వుంది. మెళ్లో ఏమీ లేదు. జడకుజడే ఎక్కడో విడిచిపెట్టినట్టు శుద్ధ బాబ్బుడు హెయిర్. మణికట్లని విమానమోక్షం. మఱి వున్నసుగుణం? "ప్రేక్షణ మాలికా మధుకరీపుంజంబు లిర్వంకలన్" అన్న మాదిరి ఘ్రాణేంద్రియం. ఆమె పక్కనో యువకుడు! ఇఖను ఆ యువకుడు ఆమెకు చేస్తూవున్న ఉపకారం అంతా ఇంతా కాదు.

బ్రిటిష్‌వారికి అమెరికావారు సాయపడి ఆయుధసామగ్రి అందించి వున్నట్టు "విల్సె" "సిజర్సు?" డబ్బా కంటెంట్సు ఆమె గుప్పిడి కందిస్తూ అగ్గిపెట్టె పొందిగ్గా ఆమె సందిటచాటుగా వెలిగిస్తూ, ఆమె కోరినప్పుడల్లా అంటిస్తూ, వొద్దన్నప్పుడల్లా తాను అంటించుకుంటూ, ఇలా నడుస్తూవుంది మధుకరన్యాయం— యువకుని ప్రక్కనొక షష్టిపూర్ణుడు గ్లాస్గోమస్లిన్ తొడిగి అందు లోంచే తన నెరసిన వెంట్రుకలు చూచుకుంటూ, తనకింకా సిగరెట్టు మానేసే వయస్సు రాలేదన్నట్టు యువకునినుండి తొ_త్త అగ్గిపెట్టి, క్రమేపి డబ్బా అదో విలాసంగా మూతమీదకు కాగితం చుట్టలోని పొల్లో ఊకో పడేలా కొడుతూ వున్నాడు, పొర్లిస్తూవున్నాడు! కొడుతూవున్నాడు! ఆ బల్లమీద నాలుగో వ్యక్తి ఓ మహమ్మడన్. జేర్లాబడే చెక్కించునే సాచేశాడు ఒక కాలు—ఆ కాలు ఈ చివర స్త్రీదాకావుందన్నా నమ్మవలసిందే! ఉండుండి ఆమె యువకుని వెనుపీఠీమార్గంగా ఇతరుల్తో నవ్వ డమూ కద్దు. ఆ బల్ల కెదరబల్లమీద ఓ బనియన్‌రాయడు, గుండెకి బనియెన్. మండకు లేదు. హౌరాలో ఎక్కానంటూ హోరహోరకూవాళ్ళు విఋవుకాపరిచేవాడు. అతగాని పక్కన ఓ మసాళా కిళ్ళీరాయడు. అడుగడుక్కొ బంగారపు మణికట్టు చిట్టిగడియారం చూచుకుంటూ ఎదర మనుష్యులు అడగనిదే— "నిరుడు దానికి మదరాసులో మూడువంద లిస్తానన్నారు. ఇప్పు డసలు ఈ రకం ముడిగడియారం దొరకనే దొరకదు." అని కోతలుకోస్తూ వున్నాడు. పిల్లకు వానిమీదనులేదు. వాని గడి యారంమీదనూ లేదు దృష్టి. తాను వదిలే పొగ, పొగ నైల్యము పొగ అనుకూలము, పొగ ప్రాతికూల్యము ఇదే ఆమె

పరకాయింపు ఎంతసేపును. ఈ తట్టు మూడోవ్యక్తి తొడల మీదను "ప్యారీ" "గుల్షన్" ఇత్యాది నామధేయాలు గల అధునా మాగజీనులు. అరబ్బీగుర్రపుజీనెక్కిన వాడిముఖాని అయినా అంతక్రూరు వుండదు. ఆ మాగజీను అట్ట చూసుకుంటూ వున్నవాని ముఖంలో వున్నట్టు—మఱి నాలుగోవ్యక్తి కేవలం నలుపు: నీగ్రో వొంటివాడు. చాయ నీగ్రోవావిచాయ రావచ్చును. పచ్చని చెట్టునీడైనా ఎరుగని వ్యక్తి. కార్మికుడు అయివుంటే—వాని పెదవులు? పెదవులు నీగ్రోవాని పెదవుల్లాంటి పెదవులే. ఆ పెదవులాడిస్తూవుండే "థాంక్సు" అని కంపార్టుమెంటులోని ఆ ఏకైక నాయకినుండి ఒక "విల్సు" అందుకున్నాడు. అందుకొని అక్కణ్ణుంచి వాడుచేసిన పని ఇది. ఆమె పారేసిన అగ్గిపుల్లలు తాను పారేసిన అగ్గిపుల్లలు కలిపి తన బూటు కిందకు లాక్కుని నలిపి ఆర్పేస్తూవుండేవాడు. ఈ బాధ భరించలేక తుదకామె ఏమి చేసిందీ? తానంటించిన అగ్గిపుల్ల వాని కందిచ్చింది, వాడా పుల్లనందుకొని ఆలా గాలిలో ఊపి ఆర్పుతూ ఉప్పున వూది కిటికీలోంచి అవలకు పారేయడం మొదలుపెట్టాడు. క్రిక్కిరిసి నిలబడిపోయిన జనం ఆదాకాపడ్డ పాట్లనుగురించి ఏమని వ్రాయను? ఒక్కొక్కళ్ళ కాళ్ళసందున ఆ నాగరీకులు పారేస్తూవచ్చిన వెలుగుపుల్లకు మఱొక్కళ్ళులిక్కిపడుతు వుండడంకూడా జరుగుతూవచ్చింది నమ్మండి!

రామమోహనుడు మరి నోరునొక్కుకు ఉండిపోవలసి వచ్చింది. గట్టిగా గలభా పెంచితే మూడోబల్లమీద కూర్చున్న వాళ్ళు "డిమోబలైజుడు" మిలిటరీవాండ్లే. వాండ్ల పవర్సు బేపవర్సు ఇంకా ప్రపంచానికి వెల్లడికాలేదాయిరి. ఈ రోజుల్లో

“ఆ” అంటే “ఆటం” ఎనెర్జీ ! ఏమంటాడు ? రామమోహన్?
ఏలూరులో దిగిపోతూ ఎవరితోనో తానూ అంతే అన్నాడు. “ఆడదానిపగ అయితే ఎల్లాగైనా భరించవచ్చునుగాని పొగ భరించలేంరా !” అని.

కాని నిజంగా ఆ స్త్రీయొక్క మానసికతత్వాన్ని ఎనలైజు చేసి చూస్తే నేను అనుకొనేది పగకాదు, పొగకాదు. అత్యంతము, ఆకర్షణీయంగాను అస్పష్టంగాను గోచరించే యుద్ధానంతరపు ఏంగ్లో - అమెరికన్ - చైనా - రష్యా - పరాసుసమ్మిశ్రితమై పాంచభౌతికమైన పగ ! అని.

.... .... .... .... ....

## యుద్ధానంతర పరిణామం

రిక్షా చెట్టుక్రింద వుంది, చెట్టు పట్నవాసపు చెట్టు. నగరంమధ్యన రోడ్డు ప్రక్కనే వుంది. రోడ్డు తార్రోడ్డు-రోడ్డు కరిగి ప్రాకినట్టు ఇటూ అటూ ఎటూ చీకటిగుయ్యారం. వేళ రాత్రి, రిక్షాసీటును మోసి కూర్చున్నాడో రిక్షావాలా. వాడు లాగే రిక్షాయే అనుకుంటాను ఆ రిక్షా, అలసి మాపటికి మఱి లాగడం ఆపేసుకుని కూర్చుని వుంటాడు. రిక్షాయొక్క కాడి దొడ్డిలో ఓ మత్తకాశిని కూర్చుని వుంది. ఎంత నల్లగా వుండాలో అంత నల్లగానూ వుంది, జుత్తూ మెడా ఏకరంగు అన్నట్టు. ఎంత పిల్లగా వుండాలో అంత పిల్లగానూ వుంది నవ్వు నుదుపు ఒకటిగా ప్రకటిస్తూ.